జీవితాంతం
నిజాయితీగా
ఉద్యోగ ధర్మం
నిర్వర్తించినందుకు
అతనికి లభించిందేమిటి?

మోర్తల
ప్రభాకర్ రెడ్డి
కథ

# ది గిఫ్ట్

ఆరోజు ఆఫీసులోకి అడుగుపెట్టగానే ఎస్టాబ్లిష్‌మెంట్ సూపర్నెంట్ ఆదినారాయణగారికి ట్రాన్స్‌ఫర్ అయిందనేవార్త షాక్‌లా తగిలింది. ఒక వ్యక్తిని అతని పరోక్షంలో కూడా 'గారు' అనే సంభోదిస్తారంటే ఆ మనిషి వ్యక్తిత్వం, మంచితనం గురించి ప్రత్యేకంగా చెప్పాల్సింది లేదనుకుంటాను.


నిజాయితీ, మంచితనం లాటివి కేవలం పదాలుగా చదవడానికి తప్ప ఎక్కడా మచ్చుకి కూడా కనిపించని ఈ రోజుల్లో వాటికి ప్రతిరూపంగా ఓ వ్యక్తి ఉన్నాడు అంటే అది గొప్ప విషయమేగా.

ఆదినారాయణ గారితో నాకున్న పరిచయం వయస్సు ఆరునెల్లే. అంత స్వల్పకాలంలోనే ఆయనంటే నాకు గౌరవం, భక్తి, అభిమానం ఏర్పడ్డాయి. నాకేకాదు ఆయనతో ఏకాస్త పరిచయం ఉన్న ఎవరికైనా అలాటి అభిప్రాయమే కలిగితీరుతుంది. అదే ఆయన వ్యక్తిత్వంలోని గొప్పతనం.

ఆయనే తల్చుకుంటే వేలు సంపాదించవచ్చు. ఆ సీటు అడ్డం పెట్టుకుని ఆయనకి ముందు ఉన్న సూపర్నెంట్ కొత్త ఇల్లు ఎలా కట్టిందీ ఆ ఆఫీసులో అందరికీ తెలుసు. మా ఆఫీసులో కనిపించే స్టాఫ్ పదిహేనుమందే అయినా... ఫీల్డ్‌స్టాఫ్, ఆ ఆఫీసుకి అనుబంధంగా పనిచేస్తున్న ఇన్‌స్టిట్యూషనల్ స్టాఫ్‌వగైరా అందర్నీ కలిపితే వందకుపైనే వుంటుంది సంఖ్య.

ఆఫీసర్ తర్వాత దాదాపు అంత పవర్, ప్రిస్టేజ్ ఉన్న పోస్ట్ అదే ఆఫీసులో.

ఆదినారాయణగారికి తెలియని సబ్జెక్ట్ మా ఆఫీసుకి సంబంధించి ఏదీలేదు.



ఒకవేళ ఏ విషయమైనా ఆయనకీ తెలీదంటే అది తెలుసుకోవలసిన ముఖ్యవిషయం కాదని అర్థం. తన పాతికేళ్ళ సర్వీసులో ఆయన దాదాపు అన్ని సెక్షన్స్‌లో పనిచేసి పండిపోయారు.

ఆఫీస్ స్టాఫ్ అంతా గుంపుగా నిలబడి ఆ విషయమే చర్చించుకోవడం కనిపించింది. ఓ పెళ్ళి ఎటెండ్ చెయ్యడానికని నాలుగురో

జులు లీవ్ పెట్టి తిరుపతివెళ్ళి ఆరోజు ఉదయమే వచ్చాను. ''ఏమిటింత సడన్‌గా.. ..'' అంటున్న నామాటలకి టైపిస్టు రామ్మూర్తి ''అదే మాకూ ఆశ్చర్యంగా వుంది. నిన్న హెడ్‌ఆఫీసునుండి స్పెషల్ మెసెంజర్ వచ్చి సరాసరి ఆఫీసరు రూంలోకెళ్ళిపోయాడు... వాడి ప్రవర్తన విచిత్రంగా అనిపించినా ఏ డి.ఓ లెటరో కాబోలు అని అనుకున్నాం వాడు వెళ్ళిన పావుగంటకు అసలు విషయం మనబాస్ చెప్పేసరికి చాలాషాక్ అయ్యాం అంతా...'' చేతులూ.. కళ్ళూ తిప్పుతూ చెప్పాడు.

''ఎవర్నివేసారు...'' అని ఊపిరినిగపట్టాను. ''సంజీవరావుని'' 'బి' వన్ సెక్షన్ వెంకటేశ్వర్లు వ్యంగ్యంగా అన్నాడు. ''వాట్... అతనా... అతను సస్పెన్షన్‌లో వున్నట్టు విన్నాను...'' నాకు అప్పుడే దిగులు మొదలైంది. ''పదిహేనురోజుల క్రితమే ట్రిబ్యునల్‌లో రియిన్‌స్టేషన్‌కి ఆర్డర్స్ సంపాదించాడు... తిన్నదాంట్లో టెన్‌పర్సెంట్ ఖర్చుపెట్టి ఏ మహానుభావుడ్నో ప్రసన్నుడ్ని చేసుకుని వుంటాడు... అయినా అదీ ఒకరంగా పెట్టుబడేగా... ఎంత... రెండునెలల్లో రికవర్ చేసుకోడూ...'' వెంకటేశ్వర్లు అక్కసుగా అన్నాడు.

ఒకరకంగా ఆదినారాయణగారు వెళ్ళిపోతున్నారనే బాధకన్నా సంజీవరావులాంటి నెంబర్‌వన్ రోగ్.... జలగ... ఆయన సీట్‌లోకి వస్తున్నాడనే బెంగే అంతకంతకు ఎక్కువ కాసాగింది.

''మన బాస్ పాపం! మనకన్నా చాలా ఫీలవుతున్నారు... అక్కడకే ఆయన ట్రాన్స్‌ఫర్ ఆర్డర్స్ క్యాన్సిల్ చేయించడానికి విశ్వప్రయత్నం చేసారు... బ్యాడ్‌లక్... లాభంలేకపోయింది'' దిగులుగా చెప్పాడు 'ఏ'టు సెక్షన్ బాలాజీ...

మా బాస్ శేషాచారిగారు చాలా భయస్థుడు... ఆయనకి ఏ ఫైలు మీద సంతకం చెయ్యాలన్నా బోలెడు అనుమానం... ఇంగారు... ఆదినారాయణగారి లాంటి అనుభవజ్ఞుడు అడుగడుగునా ఆయనకి 'గీతోపదేశం' చేసి ఆదుకుంటూ వస్తున్నారు కాబట్టి సరిపోయింది... లేకపోతే అసలు శేషాచారిగారు ఖమ్మంనుంచి బదిలీ అయి మా ఆఫీసుకి వచ్చీరాగానే ఆదినారాయణగారికి ట్రాన్స్‌ఫర్ వచ్చింది. పాపం! శేషాచారిగారే నాలుగు రోజులు నానా తిప్పలుపడి ఎలాగో అవి క్యాన్సిల్ చేయించుకొచ్చారు. ఆ గండం గడిచింది కదా అని అంతా సంతోషిస్తుండగా నాలుగునెలలు తిరక్కుండానే మళ్ళీ ట్రాన్స్‌ఫర్ వచ్చిపడింది...

ఆదినారాయణగారిని పలకరిద్దామనిపించింది... ఆయన ఛార్జ్ లిస్టు తయారుచేస్తున్నాడు... పక్కనే ఆయన అసిస్టెంట్ జగన్నాథం... ఎదురుగా దర్జాగా కూర్చుని చిద్విలాసంగా సిగరెట్ తాగుతున్న సంజీవరావును చూడగానే నాకు మనస్సు చివుక్కుమంది... హోదా దృష్ట్యా ముఖ్యంగా క్యారెక్టర్ దృష్ట్యా ఆదినారాయణగారి కాలిగోటిలో కూడా సరితూగని సంజీవరావుని అలా చూసేసరికి మాడు అదరగొడదామనిపించింది. ఎలాగో కంట్రోల్ చేసుకున్నాను... ఆమాటకొస్తే జగన్నాథం అన్నా నాకు చిరాకే. పనికి ఎప్పుడూ ఆమడదూరంలో వుంటాడు...

ఆఫీసర్ల స్వంత పనులుచేయడం... లేదా ఏదో ఆఫీసు పని అని చెప్పి తన పనులు చక్కబెట్టుకోవడం... అతనికున్న చాలా వెధవలవాట్లలో ఒక్కటిమాత్రమే. ఏ విష యం గురించి పూర్తిగా తెలియకపోయినా... గొంతువించుకుని వాదించి అవతలివాళ్ళ నోరు మూయిస్తాడు.


లంచ్ టైంలో జగన్నాథమే మా ఆఫీస్ స్టాఫ్‌ని సమావేశపరిచాడు. తనకి తనే ఓ పెద్ద లీడర్‌లా ఫీలై తెగ ఫోజు కొడుతుంటా డు.

"ఫ్రెండ్స్! మన ఆదినారాయణగారు వెళ్ళిపోతున్నందుకు చాలా బాధ స్తుంది... ఆయన అందరికీ అన్నీచేశారు... తనకం టూ ఏమీ చేసుకోలేదు... ఇప్పుడు ఆయనకి తగినవిధంగా మన కృతజ్ఞత, అభిమానం తెలియజెప్పే అవకాశం వచ్చింది... మనం అందరం కాంట్రిబ్యూట్‌చేసి ఆయనకో పర్స్ ప్రజెంట్ చేద్దాం... ఏమంటారు... అని చప్పట్ల కోసం ఆగాడు.... నలుగురైదు గురు కొట్టారు.... జగన్నాథం ఆఫీసులో హెచ్చువడ్డీకి అప్పులిస్తుంటాడు... అతనికు న్న సైడు బిజినెస్‌లలో అదొకటి. ఆ చప్పట్లు కొట్టిన వాళ్ళు అతనికి 'ఋణపడి' ఉన్నవారని ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు.

కాసేపు కాట్లాడుకున్నాక కాంట్రిబ్యూ షన్ ఉద్యోగస్థాయినిబట్టి ఇంత అని నిర్ణయిం చారు. అందరికన్నా ముందు నేను వందరూ పాయలు ఇచ్చాను. మొదటిసారిగా అందరూ సంతోషంగా, హృదయపూర్వకంగా తమవం తు కాంట్రిబ్యూషన్ ఇవ్వడం చూసి తృప్తిగా ఫీలయ్యాను. ఆదినారాయణగారు గుర్తొచ్చి అప్రయత్నంగా కళ్ళు చెమ్మగిల్లా యి.

అది నెలాఖరైనా ఎవ్వరూ అరువుపెట్టే ప్రయత్నం చేయలేదు. సాయంత్రానికి మిగ తా స్టాఫ్‌నుండి కూడా డబ్బు వసూలుచేసా రు. కొందరు అడిగిన దానికన్నా ఇంకా ఎక్కువ ఇవ్వబోయారు. మరికొంతమంది

## కంప్యూటర్ టైలర్



బట్టలు స్టిచింగ్ కోసం వచ్చిన కస్టమర్‌ను... అలా తీసుకెళ్లి ఒక విన్నగ్లాస్ చాంబర్‌లో నిలబెడితే దాని చుట్టూ అరేంజ్ చేయబడి వున్న త్రీ డైమెన్షనల్ ఫోటోలు తీయగల కెమెరాలు చకచకా స్నాప్స్ తీసేస్తాయి. ఈ ఫోటోలు క్షణాల్లో కంప్యూటర్‌కు ఫీడ్ చేయబడతాయి. ఈ ఫోటోల సాయంతో కంప్యూటర్ ఏ డిజైన్‌లో స్టిచింగ్ కావాలని టైలర్ కోరుకుంటాడో ఆ ప్రకారం కొలతలు తనకు తానుగా సెట్ చేసుకుని చకచకగా క్లాత్‌ని కట్‌చేసి అందించేసి, మరో పది నిమిషాల్లో స్టిచింగ్ పూర్తిచేస్తుంది.

—రజనీ శకుంతల (సికిందరాబాద్)

తాము విడిగా వేరే ప్రెజెంటేషన్ కొనిస్తామన్నారు. వాళ్ళందర్నీ సమాధానపర్చడానికి నేను కూడా చాలా శ్రమపడాల్సివచ్చింది.

ఏ ప్రెజెంట్ ఇవ్వాలి అనే విషయం మీద మరికాస్త రగడ జరిగింది. కొందరు 'గోల్డ్‌చెయిన్' అని, మరికొందరు ఫ్రిజ్ అనీ ఇలా ఎవరికి తోచింది వాళ్ళు సజెస్టు చేయసాగారు.

ఆఖరికి మా బాస్ కల్పించుకుని "ఇంత చిన్న విషయానికి పోట్లాటదేనికి... ఒకరు చెప్పింది మరొకరికి నచ్చడంలేదు... మనం క్యాష్‌ఇద్దాం... తన కిష్టమైనదేదో ఆదినారాయణగారే కొనుక్కుంటారు" అని సర్దిచెప్పడంతో అంతటితో ఆ గొడవ సద్దుమణిగింది.

సాయంత్రం ఆరున్నరకి ఫేర్‌వెల్ ఫంక్షన్ ఏర్పాటుచేసారు... శేషాచారిగారు... ఆయనకి అటుపక్క ఆదినారాయణ మా ప్రక్క మరో సూపర్నెంట్ దైవసహాయంగారు... కుడివైపు చివర సంజీవరావు కూర్చున్నారు....

అలాంటి ఫంక్షన్స్‌లో వెళ్ళిపోతున్న వ్యక్తిని ఇంద్రుడనీ, చంద్రుడనీ... ఆకాశానికి ఎత్తేసినట్టు మాట్లాడ్డం ఆనవాయితీ... అవతలివ్యక్తి ఎంత నికృష్టుడైనా... రక్తంతాగే రాక్షసుడైనా... ఆ క్షణంలో అకస్మాత్తుగా అతను దేవుడు అయిపోతాడు.... బహుశా ఆ 'హిపోక్రసీ' తప్పదేమో మన సమాజంలో...

అయితే ఆదినారాయణగారు నిజంగానే ఉత్తముడు, కార్యదీక్ష, దక్షత వగైరా అన్నీ వున్నవారు కాబట్టి... ఆ నిజం ఆఖరికి సంజీవరావుతో సహా అందరూ ఒప్పుకునేది కాబట్టి నాకు ఏ ఇబ్బందీ అనిపించలేదు. గిల్టీగా ఫీలవలేదు... ఒక్క సంజీవరావు ఆదినారాయణగారి ఆశీర్వాదం అభ్యర్థించినపుడు తప్ప.

ఆఖర్లో ఆదినారాయణగారు మాట్లాడటానికి లేచారు. "నాకు ఉపన్యాసాలు వినాలన్నా... చెప్పాలన్నా చాలాభయం (చప్పట్లు) ఏదైనా చెప్పడంకన్నా చేసి చూపించడం మంచిదని నావిశ్వాసం.

ఈ ఆఫీసులో నేను పనిచేసిన రెండున్నర సంవత్సరాల్లో మీరంతా నా పట్ల చూపిన అభిమానం, అందించిన సహాయ సహకారాలు నేను ఎప్పటికీ మరువలేను. ముఖ్యంగా శ్రీ శేషాచారీ, శ్రీ జగన్నాథంగార్లకు మరీమరీ ఋణపడి వుంటాను.

ఆఖరిగా మీ పట్ల ఉన్న అభిమానంతో, వయసులో మీకన్నా పెద్దవాడిగా ఈమాట చెబుతున్నాను. "జీతం తీసుకుంటున్నందుకు ఆఫీసు పని చెయ్యడం మనవిధి... అందుకు ప్రభుత్వం లేదా ప్రజలకు మనం జవాబుదారి... అయితే మనిషి జీవితంలో ఉద్యోగం మాత్రమే సర్వస్వంకాదు... అది కేవలం ఒక భాగం మాత్రమే... మనల్ని సృష్టించిన భగవంతుడు 'మనిషి'గా మనం నిర్వహించాల్సిన బాధ్యతలు కొన్ని మన భుజస్కంధాలపై మోపాడు... తోటివాడి కష్టనష్టాలలో పాలుపంచుకోవడం అన్నిటికన్న ముఖ్యమైన బాధ్యత. ఆ బాధ్యతలు మరచి ప్రవర్తించిననాడు మనం జవాబు చెప్పుకోవాల్సింది ఆ భగవంతునికి అనే విషయం ఎల్లప్పుడు గుర్తుంచుకోవాలి"

ముక్తసరిగా మాట్లాడ్తూ పరధ్యానంగా కనిపించే ఆదినారాయణగారిలో అంతగాంభీ

ర్యం... ఆధ్యాత్మిక చింతన వుందని నేనెప్పుడూ ఊహించలేదు... ఆయన ఆఖరి పలుకులు చెవుల్లో మార్మోగుతుండగా చప్పట్ల హోరులో నేనూ జతకలిపాను...

మరో అరగంట తర్వాత అందరం ఒకరివద్ద మరొకరు శలవు తీసుకున్నాం... మెట్లుదిగి వెళ్ళబోతున్న ఆదినారాయణగారిని కలిశాను. "గురువుగారు మీకు అభ్యంతరం లేకపోతే కాసేపు మాట్లాడాలనుంది. మళ్ళీ ఎప్పుడు కలుస్తామో... నేను డ్రాప్ చేస్తాను... అంతగా ఆలశం అయితే" అన్నాను.

ఆయన సహజసిద్ధమైన మొహమాటంతో కాసేపు తటపటాయించి "అలాగే... కానీ... మరోగంట ఆలశ్యం అయితే ఏం కొంపలంటుకుంటాయిలే..." అన్నారు నాతోపాటు స్కూటర్‌వైపు నడుస్తూ.


ఒక్కనిముషం అండీ... స్కూటర్ కీస్ పైనే మరిచిపోయినట్టున్నారు అంటూ గబగబా మెట్లెక్కాను.

"పీడా విరగడైంది...రఃనారిగాడో గడ్డివాము దగ్గర కాపలాకుక్క... వాడు తినడు మనల్ని తిననివ్వడు" శేషాచారిగారి స్వరం అది... నేను నా చెవుల్నే నమ్మలేకపోయాను. ఆయన ఎవరితో మాట్లాడుతున్నాడో అర్థం కాలేదు.

"ఒకదెబ్బకు రెండు పిట్టలు... నారిగాడు పోవడం... మన సంజీవరావుగారు రావడం... ఇక మనకి ప్రతిరోజూ పండగే... ఎలా వుంది సార్ నా ప్లాను... హీ" జగన్నాథం వెకిలినవ్వు.

"ప్లాను బాగానే వుంది లేవయ్యా. ఈ ట్రాన్స్‌ఫర్‌కి బోలెడు ఖర్చయింది. ఆ సంజీవరావు ఇచ్చింది ఏం సరిపోతుంది..."

శేషాచారి మాటలు వింటుంటే నారక్తం సలసలా కాగసాగింది... ఎంత నీచులు... ఒక్క ఉదుటున లోపలికెళ్ళి అందర్నీ నిలువునా పాతెయ్యాలనిపించింది.... మరి కాసేపయితే ఆ పని చేసేవాడేమో... నా భుజం మీద చెయ్యిపడ్డంతో ఉలిక్కిపడి చూశాను... ఆదినారాయణగారి చూపులన



న్ను వారిస్తున్నట్టున్నాయి... మరేం మాట్లాడకుండా సూట్‌కేస్ తీసుకుని ఆయన్ని అనుసరించాను....

పార్కులో కూర్చునేవరకూ ఇద్దరం మాట్లాడలేదు...నిశ్శబ్దాన్ని భంగపరుస్తూ "గురువుగారు... మీకు ట్రాన్స్‌ఫర్ ఎందుకైందీ... ఎవరు చేయించిందీ తెలుసా? ఆ నీచుడు శేషు..." కోపంగా దాదాపు అరుస్తున్న నన్ను ఆదినారాయణగారు ఆగమని సంజ్ఞ చేసారు.

"మూర్తి నువ్వు ఊరికే ఆవేశపడకు... నాకు అంతా తెలుసు... ఇది నీకు కొత్తకావచ్చు... కానీ నాకు మామూలే..."

"మరి అలాంటి శేషాచారి నాలుగువెల్లక్రితం మీ ట్రాన్స్‌ఫర్ క్యాన్సిల్ ఎందుకు చేయించాడు" నా మాటలకి ఆదినారాయణగారు నిర్లిప్తంగా నవ్వారు.

"శేషాచారి ఎవ్వరినీ నమ్మడు... అన్నీ స్వయంగా చూసుకుంటేగానీ అతనికి తృప్తి... ఆఫీసు వ్యవహారాలూ... రూల్స్‌గట్రా ఆయనకి మొదట్లో అంతా గందరగోళంగా తోచింది... నాకున్న అనుభవం అతనికి అవసరం అయింది. అన్నీ తెలుసుకునేవరకూ ఓపిక పట్టాడు... ఇపుడు ఆ అవసరం తీరింది. నేనుండటం ఆయనకి తలనొప్పి... పెద్దలయబిలిటీ... అందుకే అవతలకి విసిరేయించాడు" ఆదినారాయణగారిలో మళ్ళీ అదే నిర్లిప్తత.

ఆయన్ని ఇంటిదగ్గర డ్రాప్‌చేసి వెళ్ళబోతుండగా..."మూర్తి... అని పిలిచారు" నేను ఆగాను. ఆయన తటపటాయించి "నువ్వు మరోలా అనుకోకపోతే నాకు ఐదువందలు సర్దగలవా... అబ్బాయి జీతం రాగానే ఇచ్చేస్తాను..." చాలా ఇబ్బందిగా... సిగ్గుపడుతూ... ఆయన అడగడం చూసి క్షణకాలం ఎలాగో అనిపించింది.

"భలేవారే... ఇంత చిన్న విషయానికి అంత ఫీలవుతారేం... రేపు ప్రొద్దుటే తెచ్చిస్తాను... అయినా గురువుగారు మీరేం అనుకోనంటే ఆఫీసు స్టాఫ్ దాదాపు ఎనిమిది వేలు కాంట్రిబ్యూషన్ ప్రజెంట్‌చేశాంగా..

నవ్వుతూ అన్నాను. ఆయన చిన్న నిట్టూర్చి అన్నారు... నాకిచ్చిన కవర్ ఇదేగా... ఇందులో వెయ్యిరూపాయలు మాత్రం ఉన్నాయి...

*